క్లుప్తంగా

12న సర్వసభ్య సమావేశం

కోడేరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

వంగూరు: వానాకాలం పంట సాగుకు సంబంధించి సోమవారం వంగూరు మండల రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి తనూజారాజు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వంగూరు స్టేజీ వద్ద ఉన్న వైవీ ఫంక్షన్‌హాల్‌లో సదస్సు నిర్వహిస్తునట్లు తెలిపారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందుబాటులో వరి విత్తనాలు

కోడేరు: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ శ్రీరామ్ తెలిపారు. బీపీటీ 120 బ్యాగ్‌లు వచ్చాయని 25 కేజీల బస్తా రూ.1083, ఆర్‌ఎన్‌ఆర్ 50 బస్తాలు 25 కేజీల ఒక్క బస్తా రూ.1094, 1010 విత్తనాలు 120 బస్తాలు ఉన్నాయని 25 కేజీల బస్తా రూ.987, జిలుగు 30 బస్తాలు 30 కేజీలకు రూ.1116 విక్రయిస్తునట్లు పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేషన్ దుకాణాలు మంజూరు చేయండి

లింగాల: మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలకు రేషన్‌దుకాణాలను మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో దత్తారం, మగ్దుంపూర్, కేసీ తండా, ఎంసీ తండా, శ్రీరంగాపూర్, క్యాంపు రాయవర, బాకారం పంచాయతీలలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్పందించి ప్రజల సౌకర్యార్థం కొత్త గ్రామాల్లో రేషన్‌దుకాణాలను మంజూరు చేయించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు



తెలకపల్లి: మండల కేంద్రంలోని దుర్గాదేవి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం, 1008 బిందెలతో జలాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఛోడాచోపార పూజలు, కుంకుమార్చన, దుర్గాహోమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అర్చకులు ఉమాపతాచారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రామాచారి, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



కొల్లాపూర్: నీట్ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 112వ ర్యాంకు సాధించిన గిరిజన విద్యార్థిని ప్రణీతను ఆదివారం గిరిజన సంఘం నాయకులు సత్కరించారు. ప్రణీతతో పాటు ఆమె తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ హన్మంతు నాయక్, గిరిజన సంఘం నాయకులు గోవిందునాయక్, శంకర్‌నాయక్, శ్రీరామ్, చంద్రశేఖర్, గోపాల్ ,శ్రీను, జాను, బాలాజీ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి బస్సుపాస్ సౌకర్యం కల్పించాలి

అచ్చంపేట రూరల్: స్థానికంగా పనిచేసే గ్రామీణ జర్నలిస్టులకు రాష్ట్రస్థాయి బస్సు పాస్ సౌకర్యాన్ని వర్తింపజేయాలని జర్నలిస్టు యూనియన్ (టీయూడబ్ల్యూజే ఏ–143) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం జారీ చేసిన అక్రిడేషన్ కార్డులు ఈ నెల 30తో ముగియనుండడంతో కొత్త అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా జారీ చేసే అక్రిడేషన్ కార్డులతో పాటు గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా రాష్ట్రస్థాయి బస్సు పాసులను కల్పించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రాలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు 1/3 బస్సుపాసులు కాకుండా రాష్ట్రస్థాయి ఉచిత బస్సు పాస్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

బడిబాట లక్ష్యం నెరవేరేనా?



కోడేరు మండలం ఎత్తంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కోడేరు: గ్రామాల్లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులు వెచ్చించి వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగానే ప్రతి ఏటా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహిస్తున్నారు. కానీ అధికారుల నిర్లక్ష్యం పాలకుల పట్టించుకోకపోవడంతో మండలంలో పూర్తి స్థాయిలో ప్రభుత్వ లక్ష్యం నెరువేరుతుందా అని చర్చించుకుంటున్నారు. గురువారం నుంచి ప్రారంభంమైన బడిబాట ఈనెల 19 వరకు బడిబాట కార్యక్రమం కొనసాగనున్నది. ఉపాధ్యాయులు, అధికారులు బడిబయట పిల్లలను గుర్తించి పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వారు సూచిస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను 20 మంది చిన్నారులను మాత్రమే గుర్తించారు. తూతుమాంత్రంగా బడిబాట నిర్వహించి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపించాయి. విద్యా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

మండలంలో ప్రభుత్వ పాఠశాలలు

మండలంలో మొత్తం 42 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి, 6 ఉన్నత పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత, 28 ప్రాథమిక పాఠశాలలు, ఒక కస్తూర్బా పాఠశాల, ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాల, మహాత్మా జ్యోతిరావు పాఠశాలలు ఉన్నాయి. మండలంలో గత విద్యా సంవత్సరంలో 4075 మంది విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారని విద్యాధికారులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు స్పందించి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పిల్లలను పాఠశాలలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి



బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు అధికారులు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కొందరు తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపకుండా జీతాలకు పనిలో ఉంచుతున్నారు. మరి కొందరు చదువు మధ్యలోనే నిలిపి వేసి గొర్రెల, పశువుల కాపరులుగా వెళ్తున్నారు. పనికి వెళ్తున్న బాల కార్మికులను గుర్తించి పాఠశాలలకు వెళ్లేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కొమ్ముదానయ్య, కోడేరు

చర్యలు తీసుకుంటాం



బాల కార్మిక వ్యవస్థను నిర్మూలనకు ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఎవరైనా బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం . బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడికి పంపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. చిన్నారులను పనికి పంపించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. – కృష్ణయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం, కోడేరు

గ్రూపు-1 పరీక్షకు 117 మంది గైర్హాజరు



పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

తెలకపల్లి: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 288 మందికి 231 మంది అభ్యర్థులు హాజరు కాగా 57 మంది గైర్హాజరు అయ్యారు. గోవర్ధన్‌రెడ్డి డిగ్రీ కళాశాల కేంద్రంలో 312 మంది అభ్యర్థులకుగాను 257 మంది అభ్యర్థులు హాజరు కాగా 60 మంది గైర్హాజరు అయ్యారు. మొత్తం రెండు పరీక్ష కేంద్రాలకు 600 మంది అభ్యర్థులకుగాను 483 మంది అభ్యర్థులు హాజరు కాగా 117 మంది గైర్హాజరు అయినట్లు పేర్కొన్నారు. అధికారులు తిరుపతయ్య, రాజమహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీబిజీ



వనపట్ల శివారులో పత్తివిత్తనాలు వేస్తున్న కూలీలు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో కురుస్తున్న వర్షాలకు రైతులు పొలాల్లో పనుల్లో బిజీబీజీగా గడుపుతున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పత్తి విత్తనాలను నాటారు. మరికొన్ని గ్రామాల్లో పత్తి విత్తనాలను విత్తుకుంటున్నారు. నారుమడి పోసుకునేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.కూలీల కొరత కారణంగా ఇతర గ్రామాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. మండలంలో 20 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు అవుతుండగా 5 వేల ఎకరాల వరకు మొక్కజొన్న, మరో 5 వేల ఎకరాల వరకు వరిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

నిరుపయోగంగా చెక్ డ్యాంలు



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. ఆయా గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం ద్వారా ప్రతి గ్రామంలో నీటిని వృథా కానివ్వకుండ నిల్వ చేసి భూగర్భజలాలు పెంచాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన చెక్‌డ్యాంలు ఆలనాపాలనా లేక ఉపయోగం లేకుండా పోయాయని స్థానికులు వాపోతున్నారు. చెక్‌డ్యాంలు వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

బీజేపీ నాయకుల సంబరాలు



తెలకపల్లి నెహ్రూ చౌరస్తాలో బాణసంచా కాల్చుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్ క్రైం: మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేయడంపై ఆదివారం జిల్లా కేంద్రంలో బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఎదుట బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎలిమెరాము, ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, మల్లేష్, రాజేశ్వరి రెడ్డి, చందు పాల్గొన్నారు.

తెలకపల్లి: మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోడి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ చౌరస్తాలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. ఎంపీలు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు కేంద్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించడంతో సంతోషం వ్యక్తం చేశారు. దేశానికి సుపరిపాలన అందిస్తున్న ఏకైక నాయకుడు నరేంద్రమోడి అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి రవికుమార్‌రెడ్డి, రమణారెడ్డి, బాబుసాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జాంతో భక్తుల అవస్థలు



బస్టాండ్ ఎదుట నిలిచిన వాహనాలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం మైసమ్మ దేవతను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సొంత వాహనాలలో పెద్ద ఎత్తున తరలి రావడంతో మండల కేంద్రంలో వాహనాలు నిలిచిపోయి అరగంటపాడు రోడ్డుపైనే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వాహనాలను రోడ్డుపై నిలిపివేయకుండా చర్యలు తీసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తీరింది. ఆదివారం మృగశిర కార్తి రావడంతో నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాలలో తరలివచ్చారు. పెద్దకొత్తపల్లి బస్టాండ్ కూడలీలో కొబ్బరికాయలు, కోళ్ళు, వంట సామాగ్రి తదితర వస్తువులను కొనుగోలు చేసేందుకు వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పోలీసు అధికారులు పెద్ద కార్పాముల రోడ్డుపై కోళ్ళు, ఇతర వస్తువులను విక్రయించకుండా కార్పాముల మిట్ట వద్ద విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తే ట్రాఫిక్ సమస్య రాదని పలువురు పేర్కొన్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ వచ్చే వాహనాలను ముస్టిపల్లి రోడ్డు నుంచి మర్రికల్, పెద్దకార్పాముల మీదుగా మైసమ్మ జాతరకు వెళ్లేవిధంగా వాహనాలను మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ఉంటుంది. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ వెనుక ఉన్న రోడ్డు నుంచి వాహనాలను మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య తగ్గే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా సాతాపూర్ నుంచి మారేడుమాందిన్నె, యాపట్ల రోడ్డుపై నుంచి కొల్లాపూర్ నుంచి వచ్చే వాహనాలను అటు వైపు మళ్లించాలని స్థానికులు కోరుతున్నారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మృగశిర కార్తి సందర్భంగా అమ్మవారి ఆలయం ఎదుట కోళ్ళు, పొట్టేళ్ల బలి ఇచ్చారు. బంధుమిత్రులకు విందు ఇచ్చారు. పెబ్బేరు, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు ప్రైవేటు వాహనాలు, ఆర్‌టీసీ బస్సుల్లో ఆలయానికి చేరుకొని మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం 15 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

కళాకారుడికి మెరుగైన వైద్యం అందించాలి



తెలకపల్లి: కళాకారుడికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా జానపద కళాకారుల సంఘం గౌరవ సలహాదారుడు డి రాములు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు వెంకటయ్య ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం నుంచి కిందపడి తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు తోటి కళాకారులు ఆదివారం బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించి కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, ప్రచార కార్యదర్శి రాము, గౌరవ అధ్యక్షుడు రామచందర్, సభ్యులు వెంకటయ్య, చెన్నకేశవులు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల కోసం రైతుల తిప్పలు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల రైతులు సింగిల్‌విండో కార్యాలయానికి జీలుగ విత్తనాల కోసం ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండలానికి 100 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు లక్ష్యంగా కాగా 55 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మాత్రం వచ్చాయని ఏఓ సాయిరమేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం అధికారులకు సెలవు దినం అయినప్పటికి వచ్చిన 10 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను అందజేశామని ఏఓ పేర్కొన్నారు.

రాష్ట్ర సదస్సు విజయవంతం చేయండి

చారకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు– సవాలు అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వలసలు నివారించేందుకు ఉపాధి హామీ చట్టం తీసుకువస్తే కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. చట్టాన్ని రద్దు చేస్తే గ్రామాల్లో కూలీలు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సదస్సుకు రాజ్యసభ సభ్యుడు శివదాసన్, మంత్రి సీతక్క, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్,రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య, ఆర్ వెంకట్రాములు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని ఉపాధి కూలీలు, మేట్లు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

ముమ్మరంగా గుంతల తవ్వకాలు



గుంతలు తవ్వుతున్న కూలీలు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టనున్న హరితాహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తీసే కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలో దాదాపు 4 లక్షల మొక్కలకు పైగా నాటేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చెరువుకట్టల వెంట, ప్రభుత్వ స్థలాల్లో ఉపాధి కూలీలతో అధికారులు గుంతలు తీయిస్తున్నారు. ఈ నెల చివరివరకు అన్ని గ్రామాల్లో గుంతలు పూర్తి చేసి మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో ఒక్కో గ్రామంలో 200 నుంచి 500 మంది కూలీలు గుంతలు తీస్తున్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు




బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలకు స్వాగతం పలుకుతున్న నాయకులు

వెల్దండ: మండలంలోని కొట్రలో ఆదివారం బొడ్రాయి వార్షికోత్సవం సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు. బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలి వచ్చారు. బొడ్రాయికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. గ్రామ వీధులలో మామిడితోరణాలు, విద్యుత్‌దీపాలతో స్వాగతబోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు రవీందర్‌రావు, మల్లేష్, ఎంపీటీసీ రాములు, కడారి కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరపాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: నీట్ పేపర్ లీకేజీపై విచారణ చేయించాలని బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేనెల నిర్వహించిన పరీక్షలో దేశ వ్యాప్తంగా 24 లక్షలు విద్యార్థులు పరీక్షలు రాశారని పేర్కొన్నారు. ఫలితాలలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఒకే పరీక్ష పరీక్ష కేంద్రంలో ఆరు మంది విద్యార్థులకు 720/720 మార్కులు రావడంపై అనుమానాలకు తావిస్తోందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కృష్ణారెడ్డి

కల్వకుర్తిరూరల్: మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన మణెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. నియోజవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మృతురాలి భర్త యాదయ్యగౌడ్‌కు రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు దామోదర్‌గౌడ్, సురేష్‌గౌడ్, జంగయ్యగౌడ్, పర్వతాలుగౌడ్ పలువురు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని మర్చాలలో ఇటీవల మృతి చెందిన కృష్ణయ్య కుటుంబాన్ని రైతు సమన్వయ సమితి మాజీ చైర్మన్ తలసాని కృష్ణారెడ్డి పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. అదేవిధంగా ఎంపీటీసీ మల్లేష్ 50 కేజీల బియ్యాన్ని అందజేసి చేయూత నిచ్చారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన పిన్నంశెట్టి బక్కన్న(75)ఆదివారం అనారోగ్యంతో మరణించారు. బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. బక్కన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలాల్ శివుడు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సందురమేష్, కార్యవర్గ సభ్యులు ధనుంజయ్‌గౌడ్, మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్, నాయకులు రమేష్, కురుమయ్య, పులి భరత్, బాలు తదితరులు ఉన్నారు.

జేఈఈలో మెరిసిన గురుకుల విద్యార్థులు



మహేష్ | చంద్రవంశి | సూర్య | రామనాగ ప్రజిత్

కల్వకుర్తి టౌన్: జేఈఈ–అడ్వాన్స్ పరీక్షల ఫలితాలలో పట్టణంలోని జేపీనగర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని జిల్లా గురుకులాల అధికారి దానం ఆదివారం తెలిపారు. ఫలితాలలో ఎస్టీ కేటగిరీలో మహేష్ 1,648వ ర్యాంకు, చంద్రవంశి, సూర్య, హరి ఎస్సీ కేటగిరిలో 3,735, 5,231, 7,661వ ర్యాంకు సాధించారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా నీట్ ఫలితాలలో జేపీనగర్ గురుకుల పాఠశాల 8 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని వివరించారు. విద్యార్థులను ఆర్సీఓ వనజతో పాటుగా, కళాశాల లెక్చరర్లు, వారి తల్లిదండ్రులు అభినందించారు.

అచ్చంపేట: పట్టణానికి చెందిన శివ్వ రామనాగ ప్రజిత్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా 117వ ర్యాంకు సాధించారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

పెండింగ్ రుణాలు అందించాలి

పాన్‌గల్: ఎస్టీ కార్పోరేషన్ పెండింగ్ రుణాలు మంజూరు చేయాలని, గుడుంబా తయారీదారులకు ఉపాధి చూపాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఆయన గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కార్పోరేషన్ రుణాలు నాలుగేళ్లగా పెండింగ్‌లో ఉండడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గుడుంబా తయారీదారులకు ఉపాధి చూపకుండా ఎక్సైజ్ అధికారులు దాడులు చేయడం సరికాదన్నారు. ఉపాధి చూయిస్తేనే గుడుంబా తయారినీ అరికట్టవచ్చన్నారు. గిరిజనులు అత్యధికంగా ఉన్న తండాలో విద్యార్థుల కోసం ఆశ్రమ పాఠశాలను నెలకొల్పాలని కోరారు. వాల సమస్యలను పరిష్కరించకపోతే గిరిజనులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. హరినాయక్, నానునాయక్, చిట్టెమ్మ పాల్గొన్నారు.